andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
నిజామాబాద్
జిల్లా వార్తలు
5
సోమవారం 27 అక్టోబరు 2025



ఈకేవైసీతో 'ఉపాధి'

అక్రమాలకు చెక్

- పారదర్శకత కోసం ప్రభుత్వం నిర్ణయం
- ఉపాధి కూలీలకు కొనసాగుతున్న ప్రక్రియ
- ఏర్గట్ల మండలంలో ఇప్పటికే 85 శాతం పూర్తి

6



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

రాజకీయాలకతీతంగా

రైతులను ఆదుకోవాలి

- శ్రీరాంసాగర్ ముంపునకు గురైన రైతులకు ఎకరానికి రూ.50 వేలు చెల్లించాలి
- మంచిప్ప ప్రాజెక్టు కట్టకపోతే అక్కడ రైతులకు వ్యవసాయం చేసే అవకాశం ఇవ్వండి
- విలేకరుల సమావేశంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత

నిజామాబాద్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో రైతులకు అండగా ఉండాల్సిన సమయం ఇదని రాజకీయాలకు సమయం కాదని పార్టీలకతీతంగా రైతులను ఆదుకోవాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఆదివారం నగర శివారులోని ఓ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గోదావరి వరద ముంపు ప్రాంతాలైన యంచ పాటు అనేక గ్రామాలల్లో పంటలు మునిగిపోయి తీవ్రంగా నష్టపోయారన్నారు. ఈ పరిస్థితికి మాజీ మంత్రులు సుదర్శన్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, మంత్రి తుమ్మలతో సహా కలెక్టర్ దే తప్పని రైతులు అంటున్నారన్నారు. నవీపేట మండలంలో 5000 ఎకరాలకు పైగా పంట నష్టం జరిగిందని ఒక్కో ఎకరానికి రూపాయలు యాభై వేలు నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు. జిల్లాలో మక్క రైతుల పరిస్థితి కూడా అలాగే ఉందని 400 బోనస్ అని చెప్పి ఇప్పటివరకు కొనుగోల్లే ప్రారంభించలేదన్నారు. రైతులంతా రూ.1700లకే క్వింటా అమ్మేశారని దీనివల్ల రైతులకు క్వింటా రూ.700 నష్టం జరిగిందన్నారు. వరి పంట విషయంలోనూ ఈ ప్రభుత్వం ఇలాగే వ్యవహరిస్తుందని ఇప్పటికే చాలా చోట్ల వర్షం వల్ల ధాన్యం తడిసి బూజు పట్టిందని ప్రభుత్వం చివరి గింజ వరకు రైతులకు నష్టం లేకుండా కొనుగోలు చేయాలన్నారు. గత ఏడాది బోనస్‌తో కలిపి ఈ ఏడాది కూడా ఇవ్వాలని ఎన్నికలకు ముందు ఏ రకమైన బోనస్ ఇస్తామని ఇప్పుడు సన్నధాన్యానికే బోనస్ ఇస్తామని మాట మార్చారన్నారు. కనీసం సన్న రకం

మిగతా 8వ పేజీలో...



ప్రమోద్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కవిత

పోడు రైతులకు అండగా ఉంటా

- బాధిత రైతులను పరామర్శించిన ఎమ్మెల్సీ కవిత

7



కిక్కు ఎవరికో?

నేడు మద్యం దుకాణాలకు లక్కీడ్రా

- కలెక్టర్ సమక్షంలో డ్రా పద్ధతిన షాపుల కేటాయింపు
- ఏర్పాట్లు చేసిన ఎక్సైజ్ శాఖ అధికారులు
- ఎదురుచూస్తున్న దరఖాస్తుదారులు
- జిల్లాలో 102 మద్యం దుకాణాలకు 2786 దరఖాస్తులు

జిల్లాలో నూతనంగా మద్యం దుకాణాలను దక్కించుకునేది ఎవరో నేడు తేలిపోనుంది. మద్యం దుకాణాల కోసం ఎక్సైజ్ శాఖ టెండర్లు ఆహ్వానించగా జిల్లాలోని 102 దుకాణాలకు 2786 దరఖాస్తులు వచ్చాయి. 2025-27 సంవత్సరానికి గాను సోమవారం నగర శివారులోని భారతి గార్డెన్‌లో కలెక్టర్ సమక్షంలో డ్రా పద్ధతిన షాపులను కేటాయించనున్నారు. ఈ మేరకు ఎక్సైజ్ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దీంతో ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న మద్యం వ్యాపారుల్లో లక్కు ఎవరికి దక్కుతుందో... కిక్కు ఎవరికి వస్తుందోనని.. ఉత్కంఠ నెలకొంది.

నిజామాబాద్, అక్టోబర్ 26, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలోని 102 మద్యం దుకాణాలకు సోమవారం డ్రా తీయనున్నారు. రెండేళ్లపాటు మద్యం దుకాణాల కోసం ఎక్సైజ్ శాఖ నిర్వహించనున్న డ్రా కోసం ఎంతోమంది మద్యం వ్యాపారులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మద్యం షాపుల కోసం సెప్టెంబరు 26 నుంచి అక్టోబరు 18 వరకు దరఖాస్తులు స్వీకరించారు. అక్టోబరు 18న బీసీ బంద్ కారణంగా దరఖాస్తులు దాఖలు చేయకపోవడంతో వ్యాపారులు గడువు పెంచాలని కోరడంతో ప్రభుత్వం ఈనెల 23 వరకు గడువు పెంచింది.

అంతంత మాత్రంగానే స్పందన

మద్యం దుకాణాలకు ఈసారి వ్యాపారుల నుంచి అంతంత మాత్రంగానే స్పందన వచ్చింది. మొదట నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం దరఖాస్తులు తక్కువగా రావడంతో ప్రభుత్వం దరఖాస్తు గడువును పెంచింది. అయినప్పటికీ గత ఏడాది కంటే ఈ ఏడాది దరఖాస్తులు తక్కువగానే వచ్చాయి. గత ఏడాది దరఖాస్తు ఫీజు రూ. రెండు లక్షలు ఉండగా ఏడాది రూ.3 లక్షలకు పెంచడంతో దరఖాస్తుదారులు ఆసక్తిని కనపరచలేదు. గత ఏడాది జిల్లాలోని 102 దుకాణాలకు 3579 దరఖాస్తులు రాగా ఎక్సైజ్ శాఖకు రూ.71 కోట్ల 58 లక్షల ఆదాయం వచ్చింది. ఈ ఏడాది దరఖాస్తుల సంఖ్య తగ్గినప్పటికీ దరఖాస్తు ధర రూ.3 లక్షలు కావడంతో ఎక్సైజ్ శాఖకు గత ఏడాది కంటే రూ.11కోట్లు అదనంగా మొత్తం రూ.83 కోట్ల 58 లక్షల ఆదాయం వచ్చింది.

ఎవరికి దక్కేనో లక్కు

రెండేళ్లపాటు మద్యం దుకాణాల కోసం ఎక్సైజ్ శాఖ సోమవారం నిర్వహించనున్న డ్రా కోసం ఎంతోమంది మద్యం వ్యాపారులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. గత ఏడాది కంటే ఈసారి దరఖాస్తుల సంఖ్య తగ్గడంతో తమకు కలిసి వస్తుందని భావనలో మద్యం వ్యాపారులు ఉన్నారు. ఈసారి మద్యం దరఖాస్తుల్లో ఎక్కువమంది సిండికేట్‌గా టెండర్లు వేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా స్నేహితులు, చిట్టి గ్రూప్ మెంబర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు సిండికేట్ అయి దరఖాస్తులు వేసినట్లు ప్రచారం జరుగుతోంది. సిండికేట్‌గా టెండర్లు వేసి ఆ సిండికేట్‌లో ఎవరికి వచ్చిన షాపులను నిర్వహించేందుకు వ్యాపారులు ముందస్తుగానే ఒప్పందాలు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఎక్కువగా డిమాండ్ ఉన్న షాపులు ఇతరులకు

మిగతా 8వ పేజీలో...

ఏర్గట్ల దుకాణానికి 96 దరఖాస్తులు..

జిల్లాలోని 102 మద్యం దుకాణాలలో అత్యధికంగా ఏర్గట్ల దుకాణానికి 96 దరఖాస్తులు వచ్చాయి. ఆ తర్వాత ఆలూరు దుకాణానికి 74, వేల్పూర్ దుకాణానికి 69 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో తక్కువగా నగరంలోని నాందేవాడ షాప్‌కు, బోధన్ మండలం రాంపూర్ షాప్‌కు, వేల్పూర్ మండలం పడగల్ షాప్‌కు 13 దరఖాస్తులు వచ్చాయి. డ్రాలో గెలుపొందిన దుకాణదారులు 1/6 వంతు లైసెన్స్ ఫీజును డ్రా తీసే భారతి గార్డెన్‌లోనే ఏర్పాటు చేసిన బ్యాంకు కౌంటర్లో చెల్లించవలసి ఉంటుంది. ఉదయం 9 గంటలకు దరఖాస్తుదారులు భారతి గార్డెన్‌కు హాజరుకావాలని సెల్‌ఫోన్ అనుమతి ఉండదని ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

పథకం ఘనం..

ప్రయో'జనం' కనం

- జాతీయ కుటుంబ ప్రయోజన పథకంపై ప్రచారం కరువు
- కుటుంబ పెద్ద మృతిచెందితే రూ. 20వేల ఆర్థిక సాయం
- కేంద్ర పథకం కోసం ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తులు

8

పలువురు కానిస్టేబుళ్లకు ఉద్యోగోన్నతి

ఇందూర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న పలువురు కానిస్టేబుళ్లకు పోలీస్ శాఖ ఉద్యోగోన్నతి కల్పించింది. ఈ మేరకు నిజామాబాద్ సీపీ సాయిచైతన్య ఉత్తర్వులు జారీ చేశారు. పదిమంది కానిస్టేబుళ్లకు బాసర జోన్-2 పరిధిలో హెడ్ కానిస్టేబుళ్లుగా ప్రమోషన్ కల్పించారు. ఉద్యోగోన్నతిపై వీరిని జగిత్యాల జిల్లాకు పంపించారు. ప్రమోషన్ పొందిన వారిలో కమ్మర్‌పల్లి పీఎస్ కానిస్టేబుల్ వరప్రసాద్, పీసీఆర్ పీసీ సీహెచ్ శేఖర్, భీమ్‌గల్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ జి.శ్రీనివాస్, మాక్లూర్ ఠాణాకు చెందిన కె.యాదవ్, టూటౌన్ కానిస్టేబుల్ ఎండీ ఆరీఫుద్దీన్, కోటగిరి పీఎస్‌కు చెందిన కె.చిన్నయ్య, నవీపేట ఠాణా కానిస్టేబుల్ డి.శ్రీనివాస్‌రావు, రెంజల్ పీఎస్‌కు చెందిన ఎల్ లింబాద్రి, ఓడీ కానిస్టేబుల్ పి.రాంచందర్, నిజామాబాద్ రూరల్ పీఎస్ కానిస్టేబుల్ పి.గణేశ్ ఉన్నారు. వీరు జగిత్యాల జిల్లాలో రిపోర్ట్ చేయనున్నారు.

అన్నదాతతో వర్షం

దోబూచులాట

- అకాల వర్షంతో తప్పని ఇబ్బందులు
- ధాన్యం ఆరక అవస్థలు పడుతున్న కర్షకులు
- అదును దాటిన వర్షాలతో అన్నదాత అతలాకుతలం

7



నిర్వహణకు నిధుల్లేవు..

- ఉపాధి కార్యాలయాల నిర్వహణకు తప్పని ఇక్కట్లు
- ఏడాదిన్నరగా అందని డబ్బులు
- జిల్లాలో 27 ఉపాధి కార్యాలయాలు
- నెలనెలా ఖర్చులు భరించలేక సతమతమవుతున్న ఏపీవోలు
- వేతనాలు అందక ఇబ్బంది పడుతున్న సిబ్బంది

బోధన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కూలీలకు ఉపాధి చూపుతున్న ఉపాధి హామీ పథకం కార్యాలయాలకు ప్రభుత్వం నుంచి నిర్వహణ ఖర్చులు అందడం లేదు. దీంతో ఏపీవోలు నానా తంటాలు పడుతున్నారు. ప్రతి నాలుగు నెలలకోసారి అందాల్సిన నిర్వహణ ఖర్చులు ఏడాదిన్నరగా అందకపోవడంతో పలువురు ఏపీవోలు అప్పులు చేసి కార్యాలయాలను నడుపుతున్నారు. వచ్చే వేతనమే నెలనెలా సకాలంలో అందక చాలిచాలని వేతనంతో ఇంటి ఖర్చులకే ఇబ్బందులు పడుతున్న ఏపీవోలకు కార్యాలయాల నిర్వహణ అదనపు భారమైంది.

తప్పని నిర్వహణ ఖర్చులు

ఉపాధి కార్యాలయాల్లో ప్రతిరోజు స్టేషనరీ అవసరం ఉంటుంది. నెలనెలా కరెంట్ బిల్లు, ఇంటర్నెట్ బిల్లు చెల్లించాలి. ఒక్కో కార్యాలయానికి మండలంలోని గ్రామాలు, కూలీలను బట్టి 3వేల నుంచి 3500రూపాయల వరకు స్టేషనరీ నెలకు సుమారు 2వేల వరకు కరెంట్ బిల్లు, వెయ్యి రూపాయల వరకు ఇంటర్నెట్ బిల్లు చెల్లించడంతో పాటు ఇతర ఖర్చులు భరించాల్సిందే.

నాలుగు కేటగిరీలుగా కార్యాలయాలు

కేంద్ర ప్రభుత్వం కూలీల పనిదినాల ఆధారంగా కార్యాలయాలకు నిర్వహణ ఖర్చులు కేటాయిస్తుంది. రాష్ట్రంలో ఉపాధి హామీ కార్యాలయాలను నాలుగు కేటగిరిలుగా

మిగతా 8వ పేజీలో...

వేతనాలు అందక తప్పని ఇబ్బంది..

: మనోహర్, ఉపాధి హామీ ఏపీవో, బోధన్

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లకు మూడు నెలలు, ఏపీవోలకు, టీఏకు నెల, అటెండర్‌లకు, ఔట్ సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్లకు రెండు నెలల వేతనాలు రావాల్సి ఉంది. పండుగలు సైతం అప్పు చేసి జరుపుకోవాల్సి వచ్చింది. వెంటనే నిర్వహణ ఖర్చులు, పెండింగ్ వేతనాలు చెల్లించాలి.



శభాష్ వీడీసీ..

8

- స్వచ్ఛందంగా రోడ్డు మరమ్మతులు చేపట్టిన కొండాపూర్ గ్రామాభివృద్ధి కమిటీ





మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

ఆటల వైపు మహిళల మొగ్గు

- ఉషూ లీగ్ పోటీల ప్రారంభోత్సవంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

సుభాష్‌నగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నరేంద్ర మోదీ 2018లో ఖేలో ఇండియా కార్యక్రమాన్ని ప్రారంభించిన తర్వాతే అందరూ ఆటలవైపు మొగ్గు చూపుతున్నారని మరీ ముఖ్యంగా మహిళలు పెద్ద ఎత్తున ఈ ఆటల పోటీలల్లో పాల్గొడానికి ఆసక్తి కనబరుస్తున్నారని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. ఆదివారం నగరంలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి మహిళా ఉషూ లీగ్ 2025 పోటీలను ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహిళా క్రీడాకారుల పట్టుదల, కృషి, క్రీడా ప్రతిభ అద్భుతం అని అన్నారు. ఇలాంటి రాష్ట్ర స్థాయి పోటీలు యువతలో శారీరక, మానసిక, సామాజిక సామర్థ్యాలను పెంపొందిస్తాయని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించాలని పేర్కొన్నారు. ఈ లీగ్ తెలంగాణ యువతకు క్రీడా రంగంలో అవకాశాలు, ప్రేరణను అందించే వేదికగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉషూ అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



మక్కకు మద్దతు ధర

- నేటి నుంచే పూర్తి స్థాయిలో మొక్కజొన్న కొనుగోళ్లు
- జిల్లాలో 32 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- సొసైటీకి ఒకటి నుంచి మూడు చొప్పున సెంటర్లు ప్రారంభం
- జిల్లాలో 52 వేల ఎకరాల్లో పంట సాగు

నందిపేట, అక్టోబరు 26: మొక్కజొన్న సాగు రైతులకు మంచి రోజులు వచ్చాయి. మద్దతు ధరతో కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయి. ఇదివరకే నూర్పిడి ప్రారంభమైన గ్రామాల్లో పరిధిలోని సొసైటీల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. మద్దతు ధర రూ.2400 చెల్లించనున్నారు. జిల్లాలో 14 సొసైటీల పరిధిలో 32 మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇదివరకే సగానికి పైగా సొసైటీల పరిధిలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. మిగతా సొసైటీల పరిధిలో సోమవారం నుంచి మొక్కజొన్న కొనుగోళ్లు పూర్తి స్థాయిలో ప్రారంభం కానున్నాయి. ఈ పాటికే తూకం మిషన్లు, గన్నీ బ్యాగులు సొసైటీలకు చేరుకున్నాయి. ఒక్కొక్క సొసైటీ పరిధిలో ఒకటి నుంచి మూడు చొప్పున మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఆ కేంద్రాలల్లో క్వింటాలుకు రూ.2400 మద్దతు ధర లభించనుంది.

52వేల ఎకరాల్లో మొక్క జొన్న సాగు

జిల్లాలోని వివిధ గ్రామాల్లో సుమారు 52వేల93 ఎకరాల్లో మొక్కజొన్నను రైతులు సాగు చేశారు. ఇపాటికే జిల్లాలోని నందిపేట, డొంకేశ్వర్, ఆర్మూర్, ఆలూర్, వేల్పూర్, మోర్తాడ్, జక్రాన్‌పల్లి, బాల్కొండ మండలాల్లో మొక్కజొన్న నూర్పిళ్లు జరిగాయి. మిగతా మండలాల్లో కూలీల కొరతతో ఏకంగా మిషన్ ద్వారా నూర్పిడి చేయిస్తున్నారు. ఎకరాలకు 24 క్వింటాళ్ల నుంచి 28 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోంది.



ఖుద్వాన్‌పూర్‌లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్

32 మొక్కజొన్న కేంద్రాలను ఏర్పాటుకు సన్నాహాలు

జిల్లాలో సుమారు 32 కేంద్రాలను ఏర్పాటు చేయడానికి అధికారులు సన్నాహాలు చేశారు. 14 మండలాల్లోని సొసైటీల పరిధిలో కొనుగోలు చేసిన మొక్కజొన్నలను రెంజల్ ఏఎంసీ, సీడబ్ల్యూసీ సారంగపూర్, నిజామాబాద్‌లోని అమూల్య ఐజీ గోడౌన్‌కు తరలించనున్నారు. జిల్లాలో ఆలూర్, డొంకేశ్వర్, ధర్పల్లి, బాల్కొండ, మెండోర, వర్ని మండలాల్లో ఒకటి చొప్పున, నందిపేట, ముప్కాల్, ఏర్గాట్ల, మోర్తాడ్ మండలాల పరిధిలో రెండు చొప్పున, ఆర్మూర్, జక్రాన్‌పల్లి, కమ్మర్‌పల్లి, వేల్పూర్ మండలాల పరిధిలోని సొసైటీల్లో మూడు చొప్పున మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అధికారులు అన్ని రకాల చర్యలు తీసుకున్నారు.

క్రైం సమాచారం

విద్యుత్‌షాక్‌తో యువ రైతు మృతి


బసప్ప మృతదేహాన్ని బయటకు తీస్తున్న జాలర్లు

నిజాంసాగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నీటిలో ఉన్న మోటారు కేబుల్ జాయింట్ తెలిపోయి యువరైతుకు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందిన సంఘటన ఆరేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ శివకుమార్ కథనం ప్రకారం.. ఆరేపల్లి పంచాయతీ పరిధిలోని ఆరేడు గ్రామానికి చెందిన గాండ్ల బసప్ప(32) ఉల్లి నారుకు నీరు పారించడానికి పొలం వద్దకు వెళ్లారు. నిజాంసాగర్ ప్రాజెక్టులో ఉన్న మోటారు పైప్‌లైన్ వంకర బెండు సరిచేయడానికి నీటిలోకి వెళ్లగా.. మోటారు కేబుల్ వైరు తెలిఉండటంతో దానికి తగిలి విద్యుత్‌షాక్‌కు గురై నీటిలోనే మృతిచెందారు. మృతుడికి భార్య మంజుల, కూతురు, తల్లిదండ్రులున్నారు. ఘటనాస్థలానికి పోలీసులు చేరుకున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడకు తరలించారు.

చెరువులో దూకి యువకుడి ఆత్మహత్య

భిక్కనూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామేశ్వర్‌పల్లిలో మద్యానికి బానిసై భార్య తనతో లేదని బాధతో చెరువులో ఒకరు దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ అంజనేయులు ఆదివారం తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మల్లని రమేష్(35) అదే గ్రామానికి చెందిన అనీలాను 16ఏళ్ల కిందట వివాహం చేసుకున్నారు. వీరి మధ్య ఏడాది నుంచి గొడవలు జరుగుతుండటంతో అనీలా పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి రమేష్ మద్యానికి బానిసై, భార్య, పిల్లలు తనతో లేరని ఆవేదనతో జీవితంపై విరక్తి చెంది చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. కేసు నమోదు చేసుకొని.. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి జిల్లాకేంద్రానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అప్పటి వరకు గొడవ.. అంతలోనే..

▸▸ అకస్మాత్తుగా కుప్పకూలిపోయి వ్యక్తి మృతి


లాల్య(ఫైల్)

రాజంపేట, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శేర్‌శంకర్ తండా గ్రామపరిధిలో మూడు మమిళతాండకి చెందిన ముద్రిచ లాల్య(38) అకస్మాత్తుగా ఇంట్లో పడిపోయి మృతిచెందినట్లు భార్య అనిత తెలిపారు. ఎస్‌ఐ రాజు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం 8 గంటల ప్రాంతంలో ముద్రిచ లాల్య తమ పాలోల్లతో భూమి, డ్రైనేజ్ వాటర్ విషయంలో గొడవ జరిగిందని, గొడవ అనంతరం తన భర్త ఇంటి లోపలికి వెళ్లి మంచినీరు తాగి బయటకు వచ్చి అకస్మాత్తుగా కుప్పకూలిపోయాడని తెలిపారు. మృతుడి భార్య అనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. మృతునికి ముగ్గురు పిల్లలు ఉన్నారన్నారు.

స్వగ్రామానికి చేరిన శ్రీనివాస్ మృతదేహం

▸▸ వారం కిందట సౌతాఫ్రికాలో భిక్కనూరు వాసి మృతి

▸▸ అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు


శ్రీనివాస్ (ఫైల్)

భిక్కనూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన బత్తుల శ్రీనివాస్(32) వారం కిందట సౌతాఫ్రికాలో మరణించిన విషయం తెలిసిందే. శ్రీనివాస్ మృతదేహం ఆదివారం స్వగ్రామానికి చేరుకుంది. సౌతాఫ్రికా నుంచి అక్కడి ఎంబసీ అధికారులు, అక్కడి సూపర్‌వైజర్ సహాయంతో విమానంలో హైదరాబాద్‌కు రాగా.. అక్కడి నుంచి ప్రత్యేక అంబులెన్స్‌లో భిక్కనూరుకు కుటుంబసభ్యులు, స్నేహితులు తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా మృతదేహాన్ని చూసి కుటుంబసభ్యులు, బంధువులు బోరున విలపించారు. కాగా శ్రీనివాస్ మృతదేహాన్ని తీసుకువచ్చిన అంబులెన్స్‌ను శ్రీనివాస్ స్నేహితులు భిక్కనూరు చర్చి చౌరస్తా నుంచి పెద్దఎత్తున ఆయన ఇంటి వరకు ర్యాలీగా తీసుకెళ్లారు. కాగా సాయంత్రం అశ్రునయనాల మధ్య శ్రీనివాస్ అంత్యక్రియలను నిర్వహించారు.

భార్యను హత్య చేసిన భర్తకు రిమాండ్



కేసు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

పెద్ద కొడప్‌గల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విఠల్‌వాడీ తండాకు చెందిన పవార్ సవితను అనుమానంతో హత్య చేసిన భర్త కిషన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు బిచ్కుంద సీఐ రవికుమార్ తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలు ఆదివారం బిచ్కుంద సర్కిల్ కార్యాలయంలో వెల్లడించారు. విఠల్‌వాడీ తండాకు చెందిన పవార్ కిషన్ తన భార్య సవితతో కలిసి హైదరాబాద్ లింగంపల్లిలో టీ కొట్టు నిర్వహించేవాడని, తన భార్య సవిత ఎప్పుడూ ఫోన్‌లో ఇతరులతో మాట్లాడుతుందని అనుమానించి గొడవ పడేవాడని తెలిపారు. ఈ క్రమంలో ఈనెల 23న విఠల్‌వాడీకి పండుగ నిమిత్తం ఇద్దరూ రాగా, ఆమెను ఎలాగైన చంపాలనే ఉద్దేశ్యంతో పథకం ప్రకారం సవిత తలపై రుబ్బురోలుతో కొట్టి, కత్తెరతో పొడవగా సవితకు గాయాలయ్యాయన్నారు. సవితను చికిత్స నిమిత్త బాన్సువాడకు ఆసుపత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యంలో సవిత మృతి చెందినట్లు సీఐ తెలిపారు. ఈ ఘటనపై సవిత అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేసి కిషన్‌ను ఆదివారం రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు. ఎస్‌ఐ అరుణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

పెద్ద కొడప్‌గల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంజనీ గ్రామంలో శనివారం రాత్రి సమయంలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అరుణ్ కుమార్ తెలిపారు. విశ్వసనీయ సమాచారంతో పేకాట స్థావరంపై దాడిచేసి ఐదుగురిని పట్టుకొని 3 ఫోన్లు, రూ.12,750 నగదు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

ఎనిమిది మంది జూదరుల అరెస్టు

లింగంపేట, అక్టోబర్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాణాపూర్ అటవీ శివారులో జూదం ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ దీపక్‌కుమార్ తెలిపారు. బాణాపూర్ గ్రామ శివారులో (బొమ్మ బడుసు) ఆట జూదం ఆడుతున్నారని పక్కా సమాచారం ఆధారంగా పోలీసులు మెరుపు దాడి చేసి ఎనిమిది మందిని అరెస్ట్ చేశామన్నారు. వారి నుంచి రూ.3400 నగదు, ఐదు ద్విచక్రవాహనాలు, ఐదు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

విద్యుత్ మీటర్ చోరీ

డోమకొండ,అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్టుముక్కులలో కర్రోల్ల సంఘగౌడ్ ఇంటి వద్ద నుంచి విద్యుత్ మీటర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు. డోమకొండ శివారులోని ఓ రైతు పొలం వద్ద ఉన్న డబ్బాలో నుంచి ఆటోమెటిక్ స్టార్టర్‌ను చోరీ చేసినట్లు రైతులు తెలిపారు.

ఈకేవైసీతో అక్రమాలకు చెక్

▸▸ పారదర్శకత కోసం ప్రభుత్వం నిర్ణయం ▸▸ ఉపాధి కూలీలకు కొనసాగుతున్న ప్రక్రియ ▸▸ మండలంలో ఇప్పటికే 85 శాతం పూర్తి

ఏర్గట్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అక్రమాలకు చెక్ పెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక రకాల చర్యలు చేపట్టాయి. ఇప్పటికే ఆన్‌లైన్ హాజరు విధానంతో పాటు ప్రతీ కూలీ నాలుగు గంటల సమయం పనులు చేసేలా రెండు పూటలా ఫొటోలు తీసే విధానం అమలు అవుతోంది. తాజాగా ఉపాధి హామీ కూలీలకు ఈ కేవైసీ (ఎలక్ట్రానిక్ నాలెడ్జ్ కస్టమర్) నమోదు విధానాన్ని తీసుకువచ్చింది. జాబ్ కార్డు కలిగి ఉన్న ప్రతీఒక్కరూ నమోదు చేసుకుంటే పనులకు హాజరయ్యే నిబంధన ఉంది. దీంతో ప్రస్తుతం ఉపాధి హామీ అధికారులు, సిబ్బంది ఈ కేవైసీ నమోదు పనిలో నిమగ్నమయ్యారు. ఏర్గట్ల మండలంలోనూ ప్రక్రియ కొనసాగుతోంది.


ఈకేవైసీ చేస్తున్న ఉపాధి అధికారులు

పారదర్శకంగా ఉండేందుకే....

గతంలో ఉపాధి హామీలో పనిచేసే కూలీలకు మ్యాన్యువల్‌గా హాజరు వేసేవారు. దీంతో పనులకు రాకుండా వచ్చినట్లు హాజరు వేయడంతో పాటు ఇష్టారీతిగా వేతనాలు చెల్లింపు, పనులు చేసినట్లు చూపించడంతో పాటు తదితర అక్రమాలు సోషల్ ఆడిట్ ద్వారా వెలుగులోకి వచ్చాయి. ఇలాంటి వాటికి చెక్ పెట్టి.. పారదర్శకంగా పథకం అమలు చేసేందుకు అనేక రకాల సంస్కరణలను చేపట్టింది. ఇటీవల పనులకు హాజరయ్యే కూలీల ఫొటోలు పని ప్రారంభం ముందు, పని పూర్తి అయిన తరువాత ఫొటో తీసి హాజరు వేసే విధానాన్ని అమల్లోకి తెచ్చింది. కనీసం నాలుగు గంటల సమయం పనిచేస్తే హాజరు ధ్రువీకరణ జరిగేలా రూపకల్పన చేశారు.

శత శాతానికి చేరువగా..

మండలంలోని ఎనిమిది గ్రామాల్లో 85 శాతం మేర ఈ కేవైసీ పూర్తి చేశారు. ఇంకా 15 శాతం పెండింగ్‌లో ఉంది. గ్రామాల్లోని క్షేత్రస్థాయి ఫీల్డ్ అసిస్టెంట్‌లు జాబ్‌కార్డులు ఉన్న వారికి ఐరీస్ నమోదు చేస్తున్నారు. కొన్ని రోజుల క్రితం యాప్ సైతం మొరాయించడంతో ఇబ్బందులు తలెత్తాయి.

100 రోజులు పని కల్పించేందుకు కృషి



నకిలీ మస్టర్లకు తావులేకుండా లేకుండా అర్హులైన కూలీలకు వంద రోజులు పని కల్పించేందుకు కృషి చేస్తున్నాం. కూలీల ఈ కేవైసీ క్షేత్ర స్థాయిలో టీఏలు, ఎఫ్ఏల ద్వారా ప్రక్రియ కొనసాగుతోంది. పథకంలో పారదర్శకత తీసుకొచ్చేందుకు ఈ ప్రక్రియ చేపట్టాం. జాబ్ కార్డులు ఉన్నవారు తప్పకుండా నమోదు చేసుకోవాలి.

- విద్యానంద్, ఏపీవో, ఏర్గట్ల


సర్టిఫికెట్లు అందుకున్న అభ్యర్థులు

ధ్రువపత్రాల ప్రదానం

రుద్రూర్,అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): స్వామి రాందేవ్ ఆధ్వర్యంలో నిర్వహించే పతాంజలి విశ్వవిద్యాలయం ద్వారా మండల కేంద్రంలో నెల రోజులుగా అసిస్టెంట్ యోగా టీచర్ కోర్సును పలువురు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఉత్తీర్ణులైన పదిమంది అభ్యర్థులకు ఆదివారం ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పతంజలి యోగా తెలంగాణ రాష్ట్ర మీడియా ప్రభారి విశ్వనాథ్ మహజన్, రుద్రూర్ మండల భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ అధ్యక్షుడు కేవీ మోహన్, పతాంజలి యోగా సమితి మండల అధ్యక్షుడు బాలరాజ్, మహిళా విభాగం అధ్యక్షురాలు ఇందూరు జ్యోతి, కిసాన్ విభాగం అధ్యక్షుడు ప్రకాష్, అభ్యర్థులు వెంకటేశం, శ్రీనివాస్, శివ ప్రసాద్, శంకర్, హన్మాండ్లు, సాయిబాబా, చంద్రశేఖర్, గంగా మారుతి తదితరులు పాల్గొన్నారు.


ఆలయ పరిసరాలను శుభ్రం చేస్తున్న దృశ్యం

ఆర్మూర్‌లో స్వచ్ఛ భారత్

ఆర్మూర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజరాంనగర్ పురాతన శ్రీ హనుమాన్ శివదత్త సాయి ఆలయ ఆవరణలో ఆదివారం మహాత్మా స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఆలయ ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలను తొలగించారు. ప్రాంగణాన్ని కడిగి శుభ్రం చేశారు. ప్రతీ గురువారం అన్నదానం నిర్వహిస్తారని.. పిచ్చిమొక్కలతో ఇబ్బందిగా ఉండేదని శ్రమదానం నిర్వహించి ఇబ్బంది తొలగించడం అభినందనీయమని భక్తులు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద్ గౌడ్, శ్రీఖర్, గోవర్ధన్‌రెడ్డి, దినేష్, శివరాం, సంస్థ సభ్యులు సుంకె నిశాంత్, రాజ్‌కుమార్, నరేందర్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

జాతరకు ప్రత్యేక బందోబస్తు

▸▸ సీఐ సత్యనారాయణ గౌడ్


మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ గౌడ్

భీమ్‌గల్, అక్టోబరు 25(ఆంధ్ర జ్యోతి): పవిత్ర పుణ్యక్షేత్రమైన లింబాద్రి గుట్టపైకొనసాగుతున్న బ్రహ్మోత్సవాలకు సీపీ సాయి చైతన్య ఆదేశాల మేరకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు సీఐ సత్యనారాయణ గౌడ్ తెలిపారు. ఆదివారం లింబాద్రి గుట్టపై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా నవంబరు 4, 5, 6 తేదీలలో అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశాలు ఉన్నందున వన్ వే ట్రాఫిక్ నిబంధనలు అమలు చేస్తామన్నారు. వివిధ వాహనాలలో ఉత్సవాలకు వచ్చే భక్తులు తిరుగు ప్రయాణంలో పల్లికొండ, లింగాపూర్ మీదుగా భీమ్‌గల్ చేరుకుని ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ సూచించారు. వాహనాలను ఎక్కడపడితే అక్కడ పెట్టకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోషల్ మీడియాలో ఐడీ నమోదు చేయిస్తామన్నారు. ఏమైనా సమస్యలు వస్తే దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ సందీప్, ఆలయ అర్చకులు పార్థసారధి, భీమ్‌గల్ సర్వసమాజ్ కమిటీ అధ్యక్షుడు నీలం రవి, ఉపాధ్యక్షుడు బర్ల మోహన్ పాల్గొన్నారు.

క్రీడలు స్నేహభావాన్ని పెంచుతాయి


బహుమతులు అందజేస్తున్న సీఐ శ్రీధర్‌రెడ్డి

వేల్పూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రీడలు స్నేహభావాన్ని పెంపొందించడంతో పాటు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి అన్నారు. జిల్లా సీపీ సాయిచైతన్య ఆదేశాల మేరకు సే నో టు డ్రగ్స్, సేఫ్ స్పోర్ట్స్ అనే నినాదంతో వేల్పూర్ పోలీసుల ఆధ్వర్యంతో స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. సాయంత్రం పోటీల ముగింపు.. విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ టోర్నమెంట్‌లో సుమారు 20 జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా సీఐ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. పోలీసు అమరవీరుల త్యాగాలు అందరికి తెలియాలన్న ఉద్దేశంతో క్రీడా పోటీలను నిర్వహించామన్నారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ చదువు పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. యువకులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తు రాష్ట్ర , జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. అనంతరం ఈ టోర్నీలో ప్రథమ స్థానంలో నిలిచిన కుకునూర్, ద్వితీయ స్థానంలో నిలిచిన అక్లూర్, తృతీయ స్థానంలో పడిగెల గ్రామాల క్రీడాకారులకు సీఐ శ్రీధర్ రెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వేల్పూర్ ఎస్‌ఐ సంజీవ్, వివిధ పాఠశాలల పీడీలు తదితరులు పాల్గొన్నారు.


పెర్కిట్‌లో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు


ర్యాలీలో పాల్గొన్న ఎస్‌ఐ ఎండీ మాలిక్ రహ్మాన్

పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివి

ఆర్మూర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మునిసిపల్ పరిధిలోని పెర్కిట్‌లో ఆదివారం పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా సైకిల్ ర్యాలీ నిర్వహించారు. సైకిల్ ర్యాలీ పెర్కిట్ చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు సాగింది. ఈ సందర్భంగా సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ.. పోలీసులు అనుక్షణం ప్రజల శ్రేయస్సుకు పాటుపడుతారన్నారు. పోలీసు అమర వీరుల త్యాగాలు మరువలేనివన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే తమ హక్కులు, బాధ్యతలు తెలుసుకుని ముందుకు సాగాలని, ప్రతీఒక్కరు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ఆయన సూచించారు. ర్యాలీలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లిలో పోలీసుల బైక్ ర్యాలీ

జక్రాన్‌పల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో పోలీస్‌లు బైక్ ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు విధుల్లో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరులకు నివాళులు అర్పించారు. అనంతరం జక్రాన్‌పల్లిలోని ప్రధాన వీధుల గుండా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ ఎండి మాలిక్ రహ్మాన్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి


హెగ్డోలిలో సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ సునీల్

కోటగిరి, అక్టోబరు26, (ఆంధ్రజ్యోతి): యువత గంజాయి, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోటగిరి ఎస్‌ఐ సునీల్ సూచించారు. పొతంగల్ మండలంలోని హెగ్డోలి గ్రామంలో ఆదివారం రాత్రి పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని కళాబృందం ఆధ్వర్యంలో నాటిక, పాటల రూపంలో నేరాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. యువత గంజాయి, మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే భవిష్యత్ అంధకారం అవుతుందన్నారు. ఎవరైనా గంజాయి, మాదక ద్రవ్యాలను రవాణా చేస్తే తమకు సమాచారం అందించాలన్నారు. వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. మొబైల్ ఫోన్ దొంగలించినా, పోగొట్టుకున్న సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్ రికవరీ చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు మూఢ నమ్మకాలు విశ్వసించవద్దని సూచించారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాలపై 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు ముందుంటారని, అత్యవసర సమయాల్లో పోలీసు సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ బన్సీలాల్, నాయకులు శంకర్, రాంబాబు, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

ఆర్మూర్ , అక్టోబరు 26, (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లెపు వెంకటేష్ అన్నారు. ఆదివారం ఆలూర్ మండలం చేపూర్ శివారులో తడిసిన వరిధాన్య కుప్పలను తెలంగాణ రైతు సంఘం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఆరుగాలం కష్టపడి పంట పండించినప్పటికీ సరైన సమయంలో కొనుగోలు జరగక అకాల వర్షాలకు ధాన్యం తడిసి రైతులు నష్టపోయే పరిస్థితి తలెత్తింది. ప్రభుత్వం ముందుచూపుతో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి ఉంటే రైతులు తమ ధాన్యాన్ని వెంటవెంటనే విక్రయించేవారు. తద్వారా రైతులకు మేలు జరిగేవి. కొనుగోలు కేంద్రాలను అధిక సంఖ్యలో ఏర్పాటు చేసి వెంటవెంటనే ధాన్యం కొనుగోలు చేయడంతో పాటు తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం తప్పనిసరిగా కొనుగోలు చేసి రైతులు నష్టపోకుండా చూడాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు భూమన్న, మండల నాయకులు చేపూర్ సాయన్న, చిన్నారెడ్డి, సాయిక్రిష్ణ, అఖిల్, రఘుపతి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు ఇళ్లు ఇవ్వాలి

ఆర్మూర్, అక్టోబరు 26, (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కమిటీ కార్యదర్శి ప్రభాకర్, ఏఐయూకేఎస్ రాష్ట్ర కార్యదర్శి దేవరాం డిమాండ్ చేశారు. ఆదివారం అంకాపూర్‌లో ఆదివారం జరిగిన జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఇళ్లు లేని పేదలకు పాలకులు తీరని అన్యాయం చేశారని విమర్శించారు. నిర్మాణ దశలోనే గ్రామంలో సర్వే నిర్వహించి 299 మందికి ఇళ్లు ఇవ్వడానికి జాబితా తయారుచేశారని ఆ జాబితాలో ఉన్న పేర్లను ప్రజాపాలన ప్రారంభం తర్వాత పేదల పేర్లను జాబితాలో నుంచి తొలగించి ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలకు కేటాయించడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. అంతేకాకుండా ఒకే కుటుంబంలో ముగ్గురు, నలుగురికి కేటాయించడం సరైంది కాదన్నారు. డబుల్ బెడ్ రూంలు వెంటనే పూర్తి చేయాలని ఆందోళన చేశారని 52 మంది పేర్లను ఎందుకు తొలగించారో కాంగ్రెస్ నాయకులు జవాబు చెప్పాలన్నారు. నిరుపేదలై ఉండి మొదటి జాబితాలో వచ్చిన వారందరికి తప్పనిసరిగా మొదటి దశలోనే ఇళ్లను కేటాయించాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో మండల సంయుక్త కార్యదర్శి బి. కిషన్, నిఖిల్, పోశెట్టి, బోజమ్మ, మహిళలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సిబ్బంది

కొనుగోలు కేంద్రం ప్రారంభం

భీమ్‌గల్, అక్టోబరు 26, (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని కర్నిగల్లిలో సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. సొసైటీ సభ్యులు మాట్లాడుతూ.. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని కోరారు. దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ప్రతి ఒక్క అన్నదాత కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని కొనుగోలు కేంద్రాల సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు స్వామి, పట్టణ అధ్యక్షుడు జెజె నర్సయ్య, మాజీ ఎంపీపీ కన్నె సురేందర్, ఎస్సీసెల్ అధ్యక్షుడు పర్స అనంతరావు, వీడీసీ అధ్యక్షులు నీలం రవి, నల్లూరి శ్రీనివాస్, లక్ష్మణ్, రాము, తోట సతీష్, శివ, కృష్ణ, గంగాధర్, కర్ని గంగయ్య, శ్రీకాంత్, కర్రె రాజేశ్వర్, కర్నే మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన


హోమం నిర్వహిస్తున్న భక్తులు

బాన్సువాడరూరల్, అక్టోబరు 26,(ఆంధ్రజ్యోతి): మండలంలోని హన్మాజీపేట్ గ్రామంలో గౌడసంఘం ఆధ్వర్యంలో నిర్మించిన ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో భాగంగా ఆదివారం అర్చకులు మహేష్ వేదమంత్రోచ్ఛరణల మధ్య యజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. గౌడకులస్థులు యజ్ఞంలో పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం పోచమ్మ దేవతకు బోనాల సమర్పించారు. గౌడ కులస్థులు, భక్తులు, మహిళలు, పాల్గొన్నారు.

బీటీ రోడ్డుకు మరమ్మతు పనులు

జక్రాన్‌పల్లి, అక్టోబరు 26, (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు జక్రాన్‌పల్లిలో పాడైన బీటి రోడ్డు మరమ్మతు పనులను ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. గతంలో బీటీరోడ్డు మరమ్మతు పనులకు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించిన విషయం విదితమే. అప్పటి నుంచి పనులు జరగడం లేదు. నాలుగు రోజుల క్రితం జక్రాన్‌పల్లిలో వైఎస్ఆర్ కాలనీ నుంచి ఆదర్శ పాఠశాల, కస్తూర్బ పాఠశాల మీదుగా నల్లగుట్ట తాండాకు వెళ్లే ఈ బీటీ రోడ్డు చెడిపోయి గుంతలు పడగా మండల బీజేపీ నాయకులు ఈ రోడ్డును పరిశీలించారు. వారంలోగా మరమ్మతు పనులు చేపట్టకపోతే మండల కేంద్రంలో నిరాహార దీక్ష చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎట్టకేలకు ఆదివారం మరమ్మతు పనులను జక్రాన్‌పల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. సుమారు రూ. 2కోట్ల 50 లక్షలతో పనులు చేపట్టనున్నట్లు వారు తెలిపారు. పనులకు నిధులు మంజూరు చేయించిన నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి వసంత్‌రావు, అర్గుల్ సొసైటీ చైర్మన్ ఆర్మూర్ గంగారెడ్డి, మండల మైనార్టీ అధ్యక్షుడు అక్బర్ మాజీ సర్పంచ్ కాటిపల్లి నర్సారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ జితేందర్‌నాయక్, సత్యనారాయణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.


పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారు



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

బాన్సువాడటౌన్, అక్టోబరు 26, (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజు మీడియా సమావేశాలు నిర్వహిస్తున్న పోచారం అనుచరులు అసలు ఏ పార్టీలో ఉన్నారని ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ఆదివారం మండలకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి అనుచరులు కాంగ్రెస్‌లో ఉన్నారా, బీఆర్ఎస్‌లో ఉన్నారా చెప్పుకోలేక అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. 2023లో బీఆర్ఎస్ బీఫాంపై గెలిచిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మూడు నెలల్లోనే ప్రభుత్వ వ్యవసాయ సలహాదారునిగా పోస్ట్ తీసుకుని గెలుపు కోసం కృషి చేసిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను మోసం చేశారన్నారు. కష్టకాలంలో కేసీఆర్‌ను, బీఆర్ఎస్ పార్టీని విడిచి వెళ్లిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇంకా బీఆర్ఎస్‌లో ఉన్నారని ద్వితీయ శ్రేణి నాయకులు చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ద్వితీయ శ్రేణి నాయకులు చెప్పింది నిజమైతే తిమ్మాపూర్ వెంకటేశ్వర మందిరానికి వచ్చి పోచారం శ్రీనివాస్‌రెడ్డి బీఆర్ఎస్‌లోనే ఉన్నారని చెప్పడానికి సిద్ధమా అని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో మోచి గణేశ్, ఎర్రవట్టి సాయిబాబా, మొఘులయ్య, కృష్ణ, ఇషాక్, సాయిలు, నాగరాజ్ తదితరులున్నారు.

శిశుమందిర్ ఉపాధ్యాయులకు శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న సరస్వతీ శిశుమందిర్ ఉపాధ్యాయులు

బాన్సువాడటౌన్, అక్టోబరు 26, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో ఉపాధ్యాయులకు ఆదివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విభాగ్ అకాడమిక్ ఇంచార్జి పక్కి శ్రీనివాస్ ఉపాధ్యాయులకు యోగా, సంగీతం, వేద గణితం, గేమ్స్ , పంచ పరివర్తన అంశాలపై ఉమ్మడి జిల్లాల శిశుమందిర్ ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి సిర్న దత్తన్న, సిబ్బంది తదితరులున్నారు.

రబీ సాగుకు అన్నదాతలు సమాయత్తం



విత్తనాలు వేసేందుకు సిద్ధం చేసిన చేను

పెద్దకొడప్‌గల్, అక్టోబరు 26, (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని జుక్కల్, పెద్దకొడప్‌గల్, బిచ్కుంద, మద్నూర్, డోంగ్లీ మండలాల్లో ఖరీఫ్ పంట ముగియడంతో అన్నదాతలు రబీ సాగుకు సమాయత్తమవుతున్నా రు. ఆయా మండలాల్లో ఖరీఫ్ పంట సాగు కింద సోయా, మొక్కజొన్న లాంటి పంటలను సాగు చేయగా ఆ పంటలు చేతికి వచ్చాయి. దీంతో రబీ పంట సాగు చేసేందుకు గాను రైతులు తమ చేలను దుక్కిదున్ని సిద్ధం చేశారు. రబీ పంట కింద శనగ, తెల్ల కుసుమ లాంటి పంటలను సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. ఖరీఫ్‌లో ఆరుతడి పంట కింద సాగు చేసిన సోయా, పత్తిలాంటి పంటలు అధిక వర్షాలతో ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదని, రబీలో అయినా పండితే దిగుబడి వచ్చి తమకు అనుకూలంగా మారుతుందేమోనని రైతులు ఆశతో రబీ సాగుకు సమాయత్తమవుతున్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఇందల్వాయి, అక్టోబరు 26, (ఆంధ్రజ్యోతి): స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యే ఉచిత శిక్షణలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ రవి కుమార్ తెలిపారు. సీసీటీవీ శిక్షణ 13 రోజులు (నవంబర్ 3వ తేదీ నుంచి), టైలర్ శిక్షణ 31 రోజులు (నవంబర్ 18 నుంచి), మగ్గం వర్క్ 31 రోజులు (నవంబర్ 17 నుంచి), బ్యూటీ పార్లర్ 35 రోజులు (నవంబర్ 19), వెజిటేబుల్ నర్సరీ 10 రోజులు (నవంబర్ 3), పాపడ్, పికెల్ మేకింగ్ 10 రోజులు, తేనెటీగల పెంపకం 20 రోజులు, పుట్ట గొడుగుల పెంపకం 10 రోజులు ఉచిత శిక్షణతో పాటుగా ఉచిత భోజన సదుపాయం, హాస్టల్ వసతి కల్పించడం జరుగుతుందన్నారు. శిక్షణ అనంతరం ధ్రువీకరణ పత్రాలను అందించనున్నట్లు తెలిపారు. 19 నుంచి 45 సంవత్సరాల వయసు కలిగిన నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాని డైరెక్టర్ రవికుమార్ అన్నారు. ఆసక్తి గల వారు ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, 10వ తరగతి ధ్రువీకరణ పత్రము, ఐదు ఫోటోలు, బ్యాంక్ ఖాతా జిరాక్స్ కాపీలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పూర్తి సమాచారం కోసం 08461- 295428 ఫోన్ నంబర్‌లలో సంప్రదించాలన్నారు.

పెందోట పురస్కారానికి జిల్లా కవి

నిజామాబాద్ కల్చరల్, అక్టోబరు 26, (ఆంధ్రజ్యోతి): సాహిత్య రంగంలో కృషి చేసిన వారికి ప్రతి సంవత్సరం శ్రీవాణి సాహిత్య పరిషత్ సిద్దిపేట వారు అందించే పెందోట సాహిత్య పురస్కారానికి నిజామాబాద్ జిల్లాకు చెందిన కవి, రచయిత తొగర్ల సురేష్ ఎంపికయ్యారు. 2025 సంవత్సరానికి గాను ఎంపిక చేసినట్లు సంస్థ ప్రతినిధులు ప్రకటించారు. పలువురు సాహితీవేత్తలు, సంస్థలు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



ఎల్లమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

నవీపేట, అక్టోబరు26, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దర్యాపూర్‌లో ఆదివారం రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా జరుగుతున్న ఉత్సవాలలో భాగంగా చివరి రోజైన ఆదివారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకం, యజ్ఞం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతతో వర్షం దోబూచులాట

- అకాల వర్షంతో ఇబ్బందులు
- ధాన్యం ఆరక అవస్థలు పడుతున్న కర్షకులు

పెద్ద కొడప్‌గల్, అక్టోబరు 26, (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో పంట సాగుచేసిన అన్నదాతలకు సీజన్ కలిసిరావడం లేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ వర్షాలు రైతన్నలను అతలాకుతలం చేయగా, తిరిగి పంట చేతికి వచ్చే సమయంలో వానలు కురిసి ధాన్యం ఎండకుండా చేయడంతో కర్షకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి..

జుక్కల్ నియోజకవర్గంలోని పిట్లం, నిజాంసాగర్, మహమ్మద్‌నగర్ మండలాలతో పాటు బిచ్కుంద, డోంగ్లీ మండలాల్లో రైతన్నలు వరి పంటను వేలాది ఎకరాలలో సాగు చేశారు. కాగా ప్రస్తుతం ఆ పంట చేతికి వచ్చింది. దీంతో రైతన్నలు పంటను కోతలు చేసి ధాన్యాన్ని ఆరబెట్టేందుకు నానా అగచాట్లు పడుతున్నారు. వరిసాగు చేసిన ప్రారంభంలో సరైన వానలు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని, అనంతరం కురిసిన భారీ వర్షాల కారణంగా వరి పంటకు రోగాలు వ్యాపించడంతో సాగుకు కష్టకాలంగా మారిందని రైతన్నలు వాపోతున్నారు. ఉన్న పంట అయినా చేతికి వచ్చే సమయంలో వరుణుడు కరుణించకపోవడం తమ పాలిట శాపంగా మారిందని వాపోతున్నారు. అంతోఇంతో పంట చేతికి రాగా ఆ పంటను శుద్ధి చేసి అమ్ముకునేందుకు ప్రయత్నం చేద్దామంటే వరుణుడు తిరిగి వచ్చి వర్షం కురిపించడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. పంటను ఆరబెట్టేందుకు రహదారిపై ధాన్యం వేస్తే ఉదయం వాన రావడం లేదని కవర్లు తీయగానే సాయంత్రం వరకు తిరిగి ఏదో ఒక సమయంలో వాన ఆకస్మాత్తుగా కురుస్తోంది. ధాన్యం కుప్పలుగా చేసి వాటిపై కవర్లు కప్పడం, తిరిగి వర్షం తగ్గగానే కవర్లు తీసి ఆరబెట్టడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంవత్సరం ప్రకృతి రైతులపై పగబట్టినట్లుగా ఉండటంతో తామెవరికి చెప్పుకోవాలని కుమిలిపోతున్నారు. కనీసం ఒక నెల రోజుల పాటయినా వర్షం కురవకపోతే పంట అమ్ముకునేందుకు వీలవుతుందని వేడుకుంటున్నారు. అదను దాటిన వర్షాలతో ఏం చేయాలో తెలియని అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు.



ధాన్యం కుప్పపై కవరు కప్పుతున్న దృశ్యం



రహదారులపై కప్పిపెట్టిన ధాన్యం కుప్పలు

వేషమేసి.. కోతులను తరిమేసి

గ్రామాల్లో రోజు రోజుకు కోతుల బెడద అధికం అవుతోంది. అయితే వాటిని తరిమేందుకు ఒక్కో గ్రామంలో నానాపాట్లు పడుతుంటారు. అయితే కామరెడ్డి జిల్లా పెద్దకొడప్‌గల్ మండలంలోని ఓ గ్రామంలో వినూత్నంగా కోతులను తరిమేశారు. ఓ వ్యక్తి చింపాంజి వేషం వేయగా వానరాలు గ్రామం విడిచి వెళ్లిపోతున్నాయి. మండలంలోని కాటేపల్లి గ్రామంలో కోతుల బెడద ఎక్కువ కావడం, ఇళ్లలోకి ప్రవేశించి ఆహారం ఎత్తుకెళ్లడం, అడ్డువచ్చిన వారిని గాయపర్చడం లాంటివి చేస్తుండటంతో గ్రామస్థులు సమస్య పరిష్కారానికి మాజీ సర్పంచ్ విజయ్ దేశాయ్‌ని సంప్రదించారు. దీంతో ఆయన ఆన్‌లైన్‌లో చింపాంజీ డ్రెస్ ఆర్డర్ పెట్టి తెప్పించారు. ఆ డ్రెస్‌ను ఓ వ్యక్తికి వేయించి చింపాంజి వేషధారణలో గ్రామంలో తిరగాలని సూచించారు. దీంతో ఆయన వేషాన్ని చూసిన కోతులు నిజంగానే చింపాంజీ వచ్చిందని భయంతో పారిపోయాయి. దీంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తూ విజయ్‌కి, వేషం వేసిన వ్యక్తికి ధన్యవాదాలు తెలిపారు.

- పెద్ద కొడప్‌గల్, ఆంధ్రజ్యోతి



తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న తెలంగాణ రైతు సంఘం నాయకులు

నవీపేట, అక్టోబరు26, (ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం నవీపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు పరిశీలించారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయడంతో పాటు రైతులకు టార్పాలిన్ కవర్లను అందజేయాలని, కొనుగోలు కేంద్రాల సంఖ్యను పెంచాలని వారు కోరారు. అలాగే సన్న ధాన్యానికి క్వింటాలుకు 500రూపాయల బోనస్ చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దేవేందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ముప్కాల్, అక్టోబరు 26, (ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో కెమిస్ట్రీ సబ్జెక్టు బోధించేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రసాయన శాస్త్రంలో 55 శాతం ఉత్తీర్ణత, పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ఉండాలని తెలియజేశారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఈ నెల 29వ తేదీన సంబంధిత ధ్రువపత్రాలతో కళాశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తప్పిన ప్రమాదం



తెగిపోయి కిందపడిన విద్యుత్ తీగ

నవీపేట, అక్టోబరు26, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సుభాష్ నగర్ కాలనీలో ఆదివారం తృటిలో ప్రమాదం తప్పింది. కాలనీ మధ్యలో ఉన్న 11కేవీకి చెందిన విద్యుత్ తీగ అకస్మాత్తుగా తెగి స్థానికంగా ఉన్న విద్యుత్ తీగలపై పడి నేలపై పడింది. దీంతో విద్యుత్ తీగల నుండి భారీ మెరుపులు వచ్చాయి. ఈ సమయంలో సంఘటన స్థలంలో రోడ్డుపై నుంచి ఎవరూ వెళ్లకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సుమారు 50సంవత్సరాల క్రితం వేసిన 11కేవీ విద్యుత్ లైన్ కాలనీ మధ్య నుండి తొలగించాలని స్థానికులు డిమాండ్ చేశారు.

ఆర్మీ జవాన్‌కు సన్మానం



ఆంజనేయులును సన్మానిస్తున్న దృశ్యం

రామారెడ్డి, అక్టోబరు 26, (ఆంధ్రజ్యోతి): గత 15 సంవత్సరాలుగా ఇండియన్ ఆర్మీలో తనదైన సేవలు అందించి ఇటీవలే రిటైర్మెంట్ తీసుకున్న రామారెడ్డి మండలం పోసానిపేట్ గ్రామానికి చెందిన గండ్ర ఆంజనేయులుకు ఆదివారం రామారెడ్డి మండల మాజీ జడ్పీటీసీ నారెడ్డి మోహన్ రెడ్డి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో రాజశేఖర్, నాయకులు రఘోత్తం రెడ్డి, బాలరాజు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

పోడు రైతులకు అండగా ఉంటా

మోపాల్, అక్టోబర్ 26, (ఆంధ్రజ్యోతి): పోడు భూముల రైతులకు అండగా ఉంటానని ఎమ్మెల్సీ కవిత భరోసా ఇచ్చారు. ఆదివారం మోపాల్ మండలంలోని బైరాపూర్ గ్రామాన్ని ఆమె సందర్శించారు. ఇటీవల పోడు భూముల్లో సాగు చేసుకుంటున్న రైతు ప్రకాష్ ఆత్మహత్యకు పాల్పడగా, బాధిత కుటుంబాన్ని ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నో సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న గిరిజనులకు పట్టా భూములు ఇవ్వకుండా పాలకులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. దీన్ని ఆసరా చేసుకున్న ఫారెస్టు అధికారులు గిరిజనులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. పోడు భూముల్లో సాగు చేసుకుంటున్న రైతులకు ప్రభుత్వం వెంటనే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మంచిప్ప ప్రాజెక్టు పాత డిజైన్ ప్రకారమే నిర్మాణం చేపడుతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో పేర్కొన్నారని గుర్తుచేశారు. దాని ప్రకారమే ఈ ప్రాంతంలో సాగు చేసుకుంటున్న గిరిజనులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫారెస్టు అధికారులు ఈ భూములు తమ ఆధీనంలో ఉన్నాయని భయభ్రాంతులకు గురి చేయడంతో పాటు ఇబ్బందులు పెడుతున్నారంటూ మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ ప్రాంత గిరిజనులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే పోడు భూముల కోసం పోరాడుతామని హెచ్చరించారు. అనంతరం ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన ప్రకాష్ కుటుంబాన్ని ఆమె పరామర్శించి ధైర్యంగా ఉండాలని కుటుంబానికి చెప్పారు. ఆమె వెంట మాజీ జడ్పీటీసీ కమల, మండలంలోని ఆయా గ్రామాల గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గిరిజనుల ఆరాధ్య దైవమైన సేవాలాల్ మహారాజ్ ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. గ్రామానికి వచ్చిన కవితకు గిరిజనులు డప్పు వాయిద్యాలతో స్వాగతం పలికారు. గిరిజనుల నృత్యాల్లో పాల్గొన్నారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న కవిత



గిరిజనులతో కలిసి నృత్యం చేస్తున్న కవిత



వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి సొసైటీ పరిధిలోని గండి మాసానిపేట్, శివనగర్, భిక్కనూరు గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం తేమ 17శాతానికి మించకుండా ఆరబెట్టాలని, అకాల వర్షాలు కురుస్తున్నందున రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్ల వేగవంతం చేయాలన్నారు. కాంటా అయిన వెంటనే ధాన్యం బస్తాలను లారీల ద్వారా సంబంధిత రైస్‌మిల్‌కు చేరవేయాలన్నారు. ఆయన వెంట సొసైటీ సీఈవో విశ్వనాథం, సిబ్బంది, పీపీసీల ఇంచార్జిలు, రైతులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

దోమకొండ, అక్టోబరు 26, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని త్రివేణి పాఠశాలలో 2002-03 ఏడాదిలో పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వివిధ ప్రాంతాలలో వివిధ హోదాలలో స్థిరపడిన పూర్వవిద్యార్థులు మాట్లాడారు. ఒకరికొకరు తమ అనుభవాలను పంచుకుని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

దారిపై లారీలు ఇలా.. ప్రయాణం ఎలా?

● రోడ్డుపై ఇష్టానుసారంగా లారీల పార్కింగ్ ● దూరప్రాంతాల నుంచి వచ్చే వాహనాలకు ఇబ్బందులు

దోమకొండ, అక్టోబరు 26, (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ వైపు నుంచి వచ్చే వాహనాలు కామారెడ్డి జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. నేషనల్ హైవే నుంచి కామారెడ్డి సర్వీస్ రోడ్డుకు వెళ్లాలంటే పొందుర్తి రోడ్డు వద్ద ఉన్న పెట్రోల్‌బంక్ ఎదురుగా రోడ్డుపై ఇష్టానుసారంగా లారీలు పార్కింగ్ చేస్తున్నారు. దీంతో దూరప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులు రోడ్డును గుర్తించలేక సర్వీస్ రోడ్డు దాటేసి రివర్స్ వస్తున్న సంఘటనలు ప్రతి రోజు చోటుచేసుకుంటున్నాయి. మెయిన్ రోడ్డులో గతంలో ఏర్పాటు చేసిన బోర్డును సర్వీస్ రోడ్డుకంటే ముందు ఏర్పాటు చేసి వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు చూడాలని పలువురు కోరుతున్నారు.



రోడ్డుపక్కన ఆగిన లారీలు



కామారెడ్డి వెళ్లేందుకు ప్రమాదకరంగా టర్న్ అవుతున్న వాహనం



కార్యవర్గాన్ని ఎన్నుకుంటున్న ప్రతినిధులు

రైతు సంఘం నూతన కమిటీ ఎన్నిక

గాంధారి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో రైతు కమిటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సాయికుమార్, ఉపాధ్యక్షుడిగా దుర్గసాయిలు, ప్రధాన కార్యదర్శిగా గైని సాయిలు, కమిటీ సభ్యులుగా బలరాం నాయక్, లక్ష్మణ్, వినోద్, వసంత్‌రావును సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోతీరాం నాయక్ మాట్లాడుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలను నిర్వహించామని, సాగు భూముల కోసం, పోడు భూముల కోసం పోరాటాలు చేసి విజయం సాధించామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.



పథకం ఘనం.. ప్రయో'జనం' కనం

- జాతీయ కుటుంబ ప్రయోజన పథకంపై ప్రచారం కరువు
- కుటుంబ పెద్ద మరణిస్తే రూ.20వేల సాయం
- కేంద్ర పథకం కోసం ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తులు

సిరికొండ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కుటుంబాన్ని పోషించే వ్యక్తి ఆకస్మికంగా మరణిస్తే ఆ కుటుంబానికి ఒకింత సహాయం అందించి ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ కుటుంబ ప్రయోజన పథకాన్ని అమలు చేస్తోంది. పేదలకు ఎంతో మేలు చేస్తున్నందున బాధిత కుటంబాల వారు ఈ పథకాన్ని ఉపయోగించుకోవాలి. ఎనిమిదేళ్ల నుంచి ఎన్ఎఫ్‌బీఎస్ పథకం అమలవుతున్నా, ప్రజలకు అవగాహన లేకపోవడంతో సహాయం కోసం దరఖాస్తులు పెద్దగా రాలేదు.

రూ. 20 వేల ఆర్థిక సాయం..

దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబంలోని పెద్ద చనిపోతే సంబంధిత ధ్రువపత్రాలతో గ్రామ, మండల అధికారుల ద్వారా దరఖాస్తు చేసుకుంటే రూ.20వేల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందిస్తుంది. కుటుంబంలోని వితంతువు, అవివాహిత కుమార్తె, కుమారుడికి ఈ ప్రయోజనం లభిస్తుంది. కుటుంబ పెద్ద 18 నుంచి 60 ఏళ్లలోపు వయసు కలిగి ఉండాలి. సాధారణ, ప్రమాదవశాత్తు మృతి చెందిన రెండేళ్లలోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. మండల పరిషత్తు కార్యాలయానికి దరఖాస్తుతో పాటు సంబంధిత ధ్రువపత్రాలను సమర్పించాలి. ఉన్నతాధికారుల ఆమోదం తర్వాత సహాయం కోసం ప్రభుత్వానికి సంబంధిత వెబ్‌సైట్లో అప్‌లోడ్ చేస్తారు.

ప్రజలకు అవగాహన కల్పించాలి

పేద కుటుంబాల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకం గురించి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ పరంగా మండల, గ్రామ స్థాయిలో అనేక కార్యక్రమాలను చేపడుతున్నా ఏనాడు ఇలాంటి మంచి పథకం ఉందన్న విషయం ప్రజలకు తెలియపర్చడం లేదు. నామమాత్రంగా అర్జీలు వస్తున్నాయంటేనే ప్రజలకు ఎన్ఎఫ్‌బీఎస్ పథకం గురించి తెలియక పోవడమే ప్రధాన కారణం.

గ్రామ సభల్లో వివరిస్తున్నాం



పంచాయతీ కార్యదర్శుల ద్వారా గ్రామాల్లో జాతీయ కుటుంబ ప్రయోజన పథకం గురించి గ్రామసభల్లో ప్రజలకు తెలియపరుస్తున్నాం. ఈ పథకంలో లబ్ధిపొందాలంటే ప్రభుత్వం సూచించిన ధ్రువపత్రాలు తప్పనిసరి. డెత్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఫొటో, రేషన్ కార్డు,కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం, కుల, ఆదాయ పత్రాలు, బ్యాంకు ఖాతా నకలుతో మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి.

- కేఆర్ మనోహర్‌రెడ్డి, ఎంపీడీవో

విమాన సేవల పునరుద్ధరణతో కొత్త ఊపు



మన్ కీ బాత్ వీక్షిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్, నాయకులు

సుభాష్‌నగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 127వ "మన్ కీ బాత్" కార్యక్రమాన్ని ఆదివారం నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. ఐదేళ్ల తర్వాత భారత్, చైనా మధ్య విమాన సేవలు పునరుద్ధరించడం, వాణిజ్యం, పర్యాటకం, ప్రజల మధ్య సంబంధా లకు కొత్త ఊపునిస్తుందన్నారు. ఇది ప్రపంచా నికి భారత ఆర్థిక శక్తి, దౌత్య సమతుల్యతను చూపించే ఒక చిహ్నం అన్నారు. సర్దార్ వల్లభ భాయ్‌పటేల్ 150వ జయంతి సందర్భంగా ఆ యన సేవలను స్మరించడం ప్రతి భారతీయుడి కి గర్వకారణమని, పటేల్ నిర్మించిన ఐక్యత పునాదులు నేటి అభివృద్ధి భారతానికి బలమైన స్తంభాలుగా నిలిచాయన్నారు. 'రన్ ఫర్ యూని టీ' ద్వారా ఐక్యత, జాతీయతాభావం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. ప్రధాని ప్రస్తావించిన 'జీఎస్టీ పొదుపు పండుగ', 'వోకల్ ఫర్ లోకల్' కార్యక్రమాలు స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించే ప్రజా ఉద్యమాలుగా మారాయని.. ఈ ఆలోచన దేశీయ వ్యాపారాలకు కొత్త శక్తిని అందిస్తుందన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని 'గార్బేజ్ కేఫ్‌ల' వంటి వినూత్న పథకాలను మన నగరాల్లోనూ ప్రోత్సహించాలన్నారు.



రోడ్డును బాగుచేయిస్తున్న కొండాపూర్ వీడీసీ సభ్యులు

శభాష్ కొండాపూర్ వీడీసీ...

- స్వచ్ఛందంగా రోడ్డుకు మరమ్మతులు

సిరికొండ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రోడ్డు కోతకు గురై 2నెలలు గడుస్తున్నా ఆర్అండ్‌బీ శాఖ అధికారులు స్పందించకపోవడంతో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు స్పందించి ఆదివారం రోడ్డును బాగు చేయించారు. సిరికొండ మండలం కొండపూర్ రైస్‌మిల్ సమీపాన వరదలకు కామారెడ్డి-భీమ్‌గల్ వెళ్లే ప్రధాన రహదారి కోతకు గురైంది. దీంతో భీమ్‌గల్, మోర్తాడ్, సిరికొండ మండలాల ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఇది గమనించిన కొండాపూర్ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు స్పందించారు. ఆదివారం మొరం పోసి రోడ్డుకు మరమ్మతులు చేశారు. రోడ్డుకు మరమ్మతులకు సహకరించిన కొండాపూర్ వీడీసీ సభ్యులకు ప్రయాణికులు ప్రయాణికులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండపూర్ గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు నీరడి సామెల్, సభ్యులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న సొసైటీ చైర్మన్

తాడ్వాయి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించిన రైతన్నకు ప్రకృతి కూడా సహకరించడం లేదు. శనివారం కురిసిన అకాల వర్షానికి కళ్లల్లోనే ధాన్యం తడిసి ముద్దయిపోయింది. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని సొసైటీ చైర్మన్ నల్లవెల్లి కపిల్‌రెడ్డి అన్నారు. ఈయన ఆదివారం మండలంలో అకాల వర్షంతో తడిసిన ధాన్యానికి పనులను పరిశీలించారు అనంతరం మాట్లాడుతూ రైతులు ఎవరు అధైర్యపడవద్దని, తమ కు అండగా తాము ఉంటామని తెలిపారు. కల్లాల్లో ఉన్న ధా న్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని అధికారుల కు సూచించారు. అనంతరం డీసీవో మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని తెలిపారు. దానికి స్పందించి తప్పకుండా రైతులకు మేలు జరిగేలా చేస్తామ న్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ఎంపీపీ ముదాం నర్సింలు, ప్రధానకార్యదర్శి గోపాల్‌రావు, సొసైటీ డైరెక్టర్ రాజారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ లక్ష్మారెడ్డి, సంజీవరెడ్డి, సీనియర్ నాయకులు చంద్రారెడ్డి, రాజేంద్రరావు, రాజిరెడ్డి, అరవింద్, శ్యామ్, రైతులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శిశువుల సంరక్షణపై అవగాహన



అవగాహన సదస్సులో పాల్గొన్న వైద్య నిపుణులు

సుభాష్‌నగర్, అక్టోబర్ 26, (ఆంధ్రజ్యోతి) రెయిన్‌బో చిల్డ్రన్స్ ఆసుపత్రి, నిజామాబాద్ ఆబ్ స్టెట్రిక్ అండ్ గైనకాలజికల్ సొసై టీ సంయుక్తంగా, ఫోగ్సీ సహకా రంతో 'ప్రసూతి, నవజాత శిశు అత్యవసర సంరక్షణ'పై సీఎంఈ, హ్యాండ్స్-ఆన్ వర్క్ షాప్‌ను ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించారు. గైనకాలజీ, నియోనాటాలజీ, అనస్థీషియాలజీ, ఫీటల్ మెడిసిన్ నిపుణులు పాల్గొని, అత్యవసర సందర్భాల్లో చికిత్స విధానాలపై శిక్షణ ఇచ్చారు. నియోనాటల్ రీసుసిటేషన్‌ను డాక్టర్ కీర్తి వివరించగా, రక్తస్రావం, ఎక్లాంప్సియా, షోల్డర్ డిస్టోసియా, రక్త మార్పిడి నిర్వహణపై ఆచరణాత్మక శిక్షణ నిర్వహించారు. ప్రముఖ వైద్యులు శిరీష ప్రమత, అపర్ణ కప్పగంతుల, శ్రీలత పట్నాయక్ (గైనకాలజిస్టులు), మాధవ్ (అనస్థీటిస్ట్), కీర్తి (నియోనాటాలజిస్ట్), హిమబిందు (ఫీటల్ మెడిసిన్) చర్చల్లో పాల్గొని, తమ అనుభవాన్ని పంచుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల వైద్యులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. తల్లి, శిశు మరణాల రేటు తగ్గించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగింది. కార్యక్రమంలో నిజామాబాద్ రెయిన్బో ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

నిర్వహణకు నిధుల్లేవు..

(5వ పేజీ తరువాయి)

విభజించి నిర్వహణ ఖర్చులు నిర్ణయించింది. నిర్వహణ ఖర్చులు ఏడాదికి మూడు విడతలుగా ప్రతి నాలుగు నెలలకోసారి చెల్లించాలి. లక్ష కన్న తక్కువ ఉన్న పనిదినాలు ఉన్న కార్యాలయాలకు 60వేలు వీటిని మొదటి విడత 30వేల రూపాయలు మిగత రెండు విడతలుగా 18వేల చొప్పున చెల్లిస్తారు. లక్ష నుంచి 2లక్షల పని దినాలు ఉన్న కార్యాలయాలకు 70వేల రూపాయలు వీటిని మొదటి విడత 37,500 మిగత రెండు విడతలు 18,700రూపాయల చొప్పున, 2లక్షల నుంచి 3లక్షల పని దినాలు ఉన్న కార్యాలయాలకు 80వేల రూపాయలు వాటిని మొదటి విడత 42,500రూపాయలు మిగతా రెండు విడతలు 21,250రూపాయల చొప్పున, 3లక్షల కన్న ఎక్కువ పని దినాలు ఉన్న కార్యాలయాలకు లక్ష రూపాయలు వీటిని మొదటి విడత 50వేలు, మిగతా రెండు విడతలు 25వేల రూపాయల చొప్పున చెల్లిస్తారు.

ఏపీవోలకు వచ్చే వేతనమే తక్కువ

ఉపాధి హామీ కార్యాలయాల్లో ఏళ్ల తరబడి పని చేస్తున్న ఏపీవోలు రెగ్యులర్ కాలేదు. వారు ఫిక్స్‌డ్ టెన్యూర్ ఎంప్లాయిస్‌గా కొనసాగుతున్నారు. వారికి వారి సీనియారిటిని బట్టి నెలకు 44 నుంచి 56వేల వేతనం అందుతుంది. వారికి మూడేళ్లుగా డీఏ, డీఏ సౌకర్యం రద్దు చేశారు. వారు ఫీల్డ్‌కు వెళ్లిన సమావేశాలకు ప్రధాన కార్యాలయాలకు సొంత ఖర్చులతో వెళ్లాల్సిందే.

తగ్గిన పని దినాలు

కేంద్ర ప్రభుత్వ ఉపాధి హామీ పని దినాలు ఏడాదికింత తగ్గిస్తుంది. కరోనా కాలంలో 2021-22లో రాష్ట్రంలో 14.25కోట్ల పనిదినాలు ఉండగా 2022-23లో 11కోట్లకు, 2023-24లో 10.50కోట్లకు తగ్గించింది. 2024-25లో 12కోట్లకు పెంచిన పని దినాలను 2025-26లో 6.50కోట్లకు తగ్గించింది. జిల్లాలో 27 ఉపాధి హామీ కార్యాలయాలున్నాయి. ఉపాధి హామీ కార్యాలయాలకు ఏడాదికి 3విడతలుగా నిర్వహణ ఖర్చులు చెల్లించాలి. ఉపాధి కార్యాలయాలకు నిర్వహణ ఖర్చులు అందడం లేదు.



కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు

కార్తీక పూజలు

భిక్కనూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో దక్షిణకాశీగా బాసిల్లుతున్న శ్రీ సిద్ధరామేశ్వర ఆలయం భక్తులతో కిటకిటలాడింది. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని, ఆదివారం సెలువు కూడా కావడంతో ఆలయానికి ఉదయం నుంచే భక్తులు పెద్దఎత్తున చేరుకుని మూలబావి వద్ద స్నానమాచరించి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ మేరకు స్వామివారిని ఆలయ అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేకపూజలు అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు పెద్దఎత్తున కార్తీకదీపాలను వెలిగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ లిం బాద్రి, అర్చకులు, పాల్గొన్నారు.

లక్కు ఎవరికో.. కిక్కు ఎవరికో?

(5వ పేజీ తరువాయి)

వచ్చిన వాటిని గుడ్‌విల్ ఇచ్చి దక్కించుకునేందుకు మద్యం వ్యాపారులు ముందస్తుగానే ప్రణాళికలు వేసుకుంటున్నట్లు సమాచారం. గతంలో ఒకే దరఖాస్తు వేసిన వారికి షాపులు దక్కిన సందర్భాలు ఉండగా 20,30 టెండర్లు వేసిన వారికి కూడా షాపులు దక్కని పరిస్థితి ఏర్పడింది. ఒకరే ఎక్కువ టెండర్లు వేసి నష్టపోయే కంటే స్నేహితులంతా కలిసి సిండికేట్ అయి ఎక్కువ దుకాణాలకు టెండర్లు వేసినట్లు తెలుస్తోంది. సోమవారం నిర్వహించే డ్రాలో ఎవరు షాపులను దక్కించుకుంటారో తేలాల్సి ఉంది.

నగరంలో తగ్గిన దరఖాస్తులు

గతంలో కంటే భిన్నంగా ఈసారి నిజామాబాద్ నగరంలో మద్యం దుకాణాలకు దరఖాస్తులు తగ్గడం ఎక్సైజ్ శాఖ నిర్లక్ష్యమే కారణంగా తెలుస్తోంది. నగరంలో 25 మద్యం దుకాణాలు ఉండగా ఈసారి కేవలం 646 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. నగరంలో మద్యం వ్యాపారం నిర్వహించేందుకు వ్యాపారులు ముందుకు రాకపోవడంతోనే దరఖాస్తులు ఎక్కువగా రానట్లు తెలుస్తోంది. హైదరాబాద్ రోడ్డులోని ఓ ప్రముఖ హోటల్ వారు నిర్వహించే మద్యం దుకాణంలో ఎమ్మార్పీ కంటే తక్కువగా మద్యం అమ్ముతుండడంతో నగరంలోని మద్యం వ్యాపారులు తాము తీవ్రంగా నష్టపోతున్నామని అనేకసార్లు ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో ఈసారి నగరంలో మద్యం దుకాణాలకు దరఖాస్తులు చేసేందుకు వ్యాపారులు ఎవరు ముందుకు రానట్టు తెలుస్తోంది. తనిఖీలు నిర్వహించాల్సిన ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఉన్నతాధికారులు స్థానికంగా ఉండకపోవడం నెలనెల మామూళ్లు అందుతుండడంతో మద్యం వ్యాపారులు ఫిర్యాదులు చేసినా పట్టించుకోనట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎక్సైజ్ శాఖ ఉన్నత అధికారుల తీరు సొంత శాఖకు నష్టం జరిగిన తమకు స్వలాభం జరిగితే చాలన్నా తీరుతో ఉండడం విమర్శలకు తావిస్తోంది. ఇకముందైనా నగరంలో ఎమ్మార్పీకి మద్యం అమ్మేటట్లు చూడాలని వ్యాపారులు కోరుతున్నారు.

సినిమా గైడ్

దేవి	:బైసన్ (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్	కాంతారా చాప్టర్-1 (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్	కె-ర్యాంప్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్	డ్యూడ్ (11.15, 2.15, 6.15, 9.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1	కె-ర్యాంప్ (11.00, 4.40, 7.30, 10.20)
	బైసన్ (తెలుగు) (1.35)
స్క్రీన్-2	డ్యూడ్ (1.30,7.30)
	తెలుసు కదా (4.30)
	బైసన్ (తెలుగు) (10.20)
స్క్రీన్-3	బైసన్ (తెలుగు) (11.00,4.30)
	తమ్మ(1.50,7.30)
	ఎక్ దివానికి దివానియత్:(హిందీ) (10.30)

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణుమాల్)

స్క్రీన్-1	డ్యూడ్ (11.00, 2.05, 5.00, 7.55, 10.50)
స్క్రీన్-2	కాంతారా చాప్టర్-1 (10.20)
	కె-ర్యాంప్ (1.45, 7.35, 10.30)
	మిత్రమండలి (4.40)
స్క్రీన్-3	తెలుసు కదా (11.00, 1.55, 4.50, 7.45, 10.40)
స్క్రీన్-4	కె-ర్యాంప్ (10.20)
	మిత్రమండలి (1.15, 7.35)
	కాంతారా చాప్టర్-1 (4.10, 10.30)



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.1,25,700	రూ.1,15,200	రూ.150

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.155	రూ.255	రూ. 275
వెన్‌కాబ్(కిలో)	రూ.160	రూ.260	రూ. 280



తరచూ ట్రాఫిక్ జామ్



లారీలతో ధర్పల్లిలో స్తంభించిన వాహనాల రాకపోకలు

ధర్పల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ధర్పల్లిలో ప్రతిరోజు ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. వాహనాల రద్దీ వల్ల గ్రామంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో పాటు దుమ్ముధూళి వల్ల ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామానికి బైపాస్ రోడ్డు ఉన్నప్పటికీ భారీ వాహనాలు నడి గ్రామం నుంచి వెళ్లడంతో ట్రాఫిక్ సమస్య నిరంతరం కొనసాగుతుంది. భారీ వాహనాలను గతంలో దారిమళ్లిస్తుండగా ప్రస్తుతం పాత బస్టాండ్ నుంచి వాహనాలు వెళ్లడంతో ట్రాఫిక్ సమస్య భారీగానే ఉంది. భీంగల్, సిరికొండ నుంచి ధర్పల్లి మీదుగా నేషన్ హైవే వెళ్లే భారీ వాహనాలను బైపాస్ గుండా మళ్లిస్తే గ్రామంలో ట్రాఫిక్ సమస్య కొంత మేర సర్దుమనిగే అవకాశం ఉంది. పోలీసులు స్పందించి ట్రాఫిక్ సమస్యను తీర్చాలని మండల ప్రజలు కోరుతున్నారు. మండల కేంద్రంలో ఆదివారం సంత కావడంతో మరింత ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు తప్పడం లేదు. భారీ వాహనాలను బైపాస్ నుంచి మళ్లించి సమస్యను తీర్చాని ధర్పల్లి గ్రామస్థులు కోరుతున్నారు.

రాజకీయాలకతీతంగా రైతులను ఆదుకోవాలి

(5వ పేజీ తరువాయి)

ధాన్యానికైనా సరిగ్గా బోనస్ ఇవ్వలేని పరిస్థితి ఈ ప్రభుత్వానిదన్నారు. మంచిప్ప ప్రాజెక్టును కట్టబోమని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారని అక్కడి పోడు రైతులకు పట్టాలి ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ ఫారెస్ట్ అధికారులు చేతికి వచ్చిన పంటపై విషం జల్లి పాడు చేశారని ఆవేదనతో రైతు ఆత్మహత్య చేసుకున్నాడని పోడు రైతుల విషయంలో ఫారెస్ట్ అధికారులు సమయమనం పాటించాలని కలెక్టర్ ఆదేశాలు ఇవ్వాలన్నారు. జిల్లాలో బీడీ కంపెనీ వాళ్లు కోత పెట్టడంతో మహిళలకు నష్టం జరుగుతుందని దీనిపై జిల్లాకు చెందిన కాంగ్రెస్ బీజేపీ ఎమ్మెల్యేలు పోరాటం చేయాలన్నారు. మాధవ్‌నగర్ బ్రిడ్జి విషయంలో ఎంపీ అర్వింద్‌కు చిత్తశుద్ధి ఉంటే నిధుల కోసం రేవంత్ రెడ్డి ఇంటి ముందు ధర్నా చేయాలని లేదంటే కేంద్రంతో మాట్లాడి నిధులు తీసుకువచ్చి పనులు పూర్తి చేయాలన్నారు. గతంలో కే టాక్స్ నడుస్తుందని ఆరోపణలు చేసిన అర్వింద్ మరి ఇప్పుడు ఏ టాక్స్ నడుస్తుందో జవాబు చెప్పాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గొప్ప సీఎం అని మంచి నాయకుడు అన్నారు. కొంతమంది వల్లే ఆయనకు చెడ్డ పేరు వచ్చిందని బీఆర్ఎస్‌ను కానీ కేసీఆర్‌ను కానీ ఏదైనా విషయం మీదనే విమర్శిస్తానే తప్ప.. వేరే ఉద్దేశం ఏమీ లేదన్నారు. తాను టీఆర్ఎస్‌లో తిరుగుబాటు చేయలేదని ఆ అవకాశం ఇవ్వకుండానే పార్టీ నుంచి బయటకు పంపారని ఆమె అన్నారు. ఐదేళ్ల క్రితమే ఎమ్మెల్యేల పని తీరు ఏమిటో సమీక్షించుకుంటే గత ఎన్నికల్లో టీఆర్ఎస్ ఓడిపోయేది కాదని ఈ విషయాన్ని అనేక సమీక్షల్లో చాలామంది చెప్పారన్నారు. నిజామాబాద్‌లో తన ఓటమికి ఎమ్మెల్యేలే కారణమని తాను చాలా సార్లు చెప్పానని ఇలా బహిరంగంగా చెప్పడం ఇదే మొదటి సారి అన్నారు. కేసీఆర్ నాతో పార్టీ పెట్టిస్తున్నారని విమర్శల్లో అర్థం లేదని ఆయనే తనను పార్టీ నుంచి బహిష్కరించినప్పుడు ఆయన ఎలా పార్టీ పెట్టిస్తారో జవాబు చెప్పాలన్నారు. టీఆర్ఎస్‌లో పార్టీకి నష్టం చేసే వారిదే పైచేయిగా ఉంటుందని మోసపూరిత వ్యక్తుల చేతనే టీఆర్ఎస్‌కు కేసీఆర్‌కు నష్టం జరిగిందన్నారు. తెచ్చుకున్న తెలంగాణ అందరి తెలంగాణ కావాలనేదే తన ఉద్దేశమని అందుకే అవకాశం, అధికారం ఆత్మగౌరవం అనే నినాదంతో ముందుకు వెళ్తున్నామన్నారు. సామాజిక తెలంగాణ సాధన ద్వారానే ఇది సాధ్యమవుతుందని అందరికీ మంచి జరగాలని తాను జనం బాట పట్టానన్నారు. నీళ్లు నిధులు నియామకాల పేరుతో తెలంగాణ ఉద్యమం విజయవంతమైందని కానీ ఇప్పుడు విద్య అందరికీ అందుబాటులో లేదని ఫీజు రియింబర్‌మెంట్ ఇవ్వడం లేదన్నారు. మైనార్టీల పేరు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని కానీ మైనార్టీ మంత్రి లేని మొట్టమొదటి ప్రభుత్వం ఇదే అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కళాకారులు ఉద్యమకారులను కలుస్తామని వారి పింఛన్ కోసం పోరాటం చేస్తానన్నారు. అంతకుముందు చిందు కళాకారులతో పాటు నగరానికి చెందిన మేధావులు విద్యావేత్తలు వివిధ రంగాల ప్రముఖులతో కవిత సమాలోచనలు జరిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఎస్ఏ అలీమ్, నవీనా చారి, సుదం రవిచందర్, శ్రీనివాస్ గౌడ్, ఎనుగందుల మురళి, కలిపే రాజు పాల్గొన్నారు. అనంతరం నగరంలోని వినాయకనగర్‌లో గల తెలంగాణ అమర వీరుల స్థూపానికి కవిత పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబాన్ని పరామర్శించిన కవిత

రౌడీషీటర్ రియాజ్ దాడిలో మృతి చెందిన కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబ సభ్యులను ఆదివారం కవిత పరామర్శించారు. నగరంలోని బ్యాంకు కాలనీలో గల ప్రమోద్ నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా రియాజ్‌ను పట్టుకోవడంలో కత్తిపోట్ల గురైన ఆసిఫ్‌ను నెహ్రూనగర్ లోని ఆయన నివాసంలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆసిఫ్ ధైర్యసాహసాలను కొనియాడారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.